• సరూర్‌నగర్ పెట్రోల్ బంక్ వద్ద పోలీసులకు ఆదేశాలిస్తున్న రేవంత్

• అష్ట కష్టాల తర్వాత ఈ మాత్రం వచ్చారు

• రాహుల్‌సభకు జనం రాకపోవడంతో ఇలా పిల్లల్ని కూడా లోపలికి తరలించారు

హైదరాబాద్ ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర సభకు జనం రాకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా గేటు వద్దకు వచ్చి ప్రజలను సభా ప్రాంగణంలోకి వెళ్లాలని కోరుతున్న దృశ్యం.. స్టేడియంలో ఆటలు ఆడుకోవడానికి వచ్చిన చిన్నారులను సైతం కుర్చీల్లో కూర్చోబెట్టిన కాంగ్రెస్ శ్రేణులు

రాహుల్ సభ అట్టర్ ఫ్లాప్

మొదటిపేజీ తరువాయి...

సరిగ్గా ఆరు గంటల సమయంలో రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి, నేతలు అంజన్‌కుమార్ యాదవ్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు అక్కడికి చేరుకున్నారు. కానీ అప్పటికి సభా ప్రాంగణంలో కనీసం వంద మంది కూడా లేని పరిస్థితి. దీంతో ఏం చేయాలో తెలియక రాహుల్ గాంధీ తన వాహనంలోనే ఉండిపోయారు. రేవంత్‌రెడ్డి పరిస్థితిని గుర్తించి... స్టేడియం వెలుపలికి వెళ్లి ప్రజలు సభా ప్రాంగణంలోకి వెళ్లేలా పురమాయించారు. పైగా వస్తున్న డీసీఎంల్లో కూడా పలుచగా వచ్చే జనాన్ని వెంటనే స్టేడియం లోపలికి వెళ్లేలా సీఎం, ఇతర నేతలు, పోలీసులు సూచనలు చేస్తూ వచ్చారు.

గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ నిర్వహించిన జన జాతర సభకు డీసీఎంలో కొందరే వస్తున్న పార్టీ కార్యకర్తలు

45 నిమిషాలు వేచి... ఇక లాభం లేక!

సభా ప్రాంగణానికి వచ్చిన రాహుల్‌గాంధీ ఏకంగా 45 నిమిషాల పాటు ప్రజల కోసం వేచి చూశారు. కానీ పెద్దగా ప్రజలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఎట్టకేలకు సాయంత్రం 7.10 గంటలకు రాహుల్ సభా వేదికపైకి వచ్చారు. అప్పటికీ ప్రాంగణంలో కుర్చీలన్నీ దాదాపుగా ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇక లాభం లేదనుకుని వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. సీఎం ప్రసంగిస్తుండగానే చాలామంది మహిళలు వెనక్కి వెళ్లిపోవడం కనిపించింది. దీంతో రేవంత్ తన ప్రసంగాన్ని అర్ధాంతరంగా ముగించి... రాహుల్‌గాంధీ మాట్లాడాల్సిందిగా కోరారు. దీంతో రాహుల్ కూడా తన ప్రసంగాన్ని త్వరగానే ముగించారు. దీంతో సభకు వచ్చిన కాంగ్రెస్ నేతల ముఖాల్లో నిరాశ, నిస్పృహలు కనిపించాయి. మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాల మధ్యలో ఉన్న ఈ సభా ప్రాంగణం చుట్టుపక్కల భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని ప్రాంతాలకు చెందిన వారు కూడా పెద్ద ఎత్తున నివాసముంటారు. అయినప్పటికీ సభకు ప్రజలు రాకపోవడంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీపై క్షేత్రస్థాయిలో ఉన్న వ్యతిరేకతకు ఇదో నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ చిత్రం.. ఉల్టా పల్టా

రాహుల్ సభలో ఖాళీ కుర్చీలు కనబడడం కన్నా.. ముఖ్యమంత్రి సహా నేతలందరూ రోడ్డుమీదికి వచ్చి ప్రజల్ని సభలోకి పంపేందుకు ప్రయత్నించడం చూసి అక్కడున్న పాత్రికేయులూ నివ్వెరపోయారు. చిన్న సభనూ నింపడానికి కాంగ్రెస్ నాయకులు ఆపసోపాలు పడటం వారిని విస్తుపోయేలా చేసింది. 3 పార్లమెంటరీ నియోజకవర్గాల సభ ముగిసేసరికి ముఖ్యనాయకులకు మూడు చెరువుల నీళ్లు తాగినంత పనైందని పలువురు అభిప్రాయపడ్డారు. 'కాంగ్రెస్ ప్రచారఢంకా సరూర్‌నగర్ సభతో బద్దలైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తెలంగాణలో కనీసం ఒక్క సీటయినా గెలుస్తుందా అన్న అనుమానాలు మొదలయ్యాయి. మూడు పార్లమెంటరీ నియోజకవర్గాల ఉమ్మి సభకు నాయకులు, అభ్యర్థులూ జనసమీకరణ చేయలేదా? లేక చేసినా జనం రాలేదా? అన్న ప్రశ్నలు మొదలయ్యాయి' అని సీనియర్ పాత్రికేయుడు ఒకరు చెప్పారు. చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి పార్లమెంటరీ సెగ్మెంట్లలో ఈసారి కాంగ్రెస్ కథ ఒడిసినట్టేనని, ఆ పార్టీకి ఓటమి ఖాయమైనట్టుగా కనిపిస్తున్నదని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు.

సర్ది చెప్పకోలేక సతమతం

రాహుల్‌గాంధీ సభకు జనం రాకపోవడంపై కాంగ్రెస్ నేతలు అనధికారిక సంభాషణల్లో వింత వింత కారణాలు చెప్పుకొచ్చారు. 'సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం లోపలికి వెళ్లేందుకు మూడుదారులున్నాయి. ఇందులో రెండు దారులు సాధారణ ప్రజలకు, ఒక దారిని వీఐపీల రాకపోకలకు వినియోగిస్తారు. ఎన్నికల సమయంలో స్టేడియంను డీఆర్‌సీ సెంటర్‌గా వాడుతున్నారు. ఎన్నికల సామగ్రి ఉండడంతో పోలీసులు సామాన్య ప్రజలను ప్రధాన గేట్ నుంచి అనుమతించలేదు. ప్రజలను డాక్టర్స్ కాలనీ నుంచి వెళ్లమనడంతో సభకు వచ్చిన వారు లోపలికి వెళ్లేందుకు కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి' అని వారు సమర్థించుకోచూశారు. మా పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉన్న ఈ సమయంలో కనీసం జనం ఏ గేటు నుంచి లోపలివెళ్లాలో కూడా పోలీసులతో చెప్పించుకోలేమా? అసలు కారణం అదికాదు అని ఇంకొకరు వ్యాఖ్యానించారు. ప్రజల రాక నెమ్మదిగా సాగుతుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి స్టేడియం బయటకు వచ్చారు. ఆ సమయంలో కొందరు డీసీఎం నుంచి దిగుతున్నారు. సీఎం కాన్వాయ్‌ను స్టేడియం బయట ఆపి ప్రజలను తొందరగా లోపలికి వెళ్లేందుకు వీఐపీ గేట్ నుంచి అనుమతించినట్టు పోలీసులు చెప్పారు.

దృష్టి మరల్చేందుకు.. బస్సెక్కిన రాహుల్!

పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు ఎన్నో అంచనాలు పెట్టుకున్న రాహుల్ సభ అట్టర్‌ఫ్లాప్ కావడం, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులపై ప్రభావం చూపుతుందని భావించిన నాయకత్వం నష్టనివారణకు దిగింది. సభ వైఫల్యం నుంచి ప్రజలు, మీడియా దృష్టిని మరల్చేందుకు ప్రయత్నించింది. సరూర్‌నగర్ సభ తర్వాత రాహుల్‌గాంధీ అప్పటికప్పుడు ఓ సిటీ బస్ ఎక్కారు. కాంగ్రెస్ నాయకులు కూడా ఆయనను అనుసరించారు. బస్సులో కాంగ్రెస్ కరపత్రాలను రాహుల్ ప్రయాణికులకు పంచిపెట్టారు. కొద్దిసేపటి తర్వాత బస్సుదిగి తిరిగి తన కారవాన్‌లోకి వెళ్లిపోయారు.

కాంగ్రెస్‌దంతా 'గాడిద గుడ్డు'లాంటి డొల్లేనా?

రాష్ట్రంలో ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తున్నది. ముఖ్యంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు సరిగా లేకపోవడం ఒకవంతైతే.. సాగు, తాగునీరు, కరెంటు కోతలు ప్రజలను తీవ్రస్థాయిలో ఇబ్బంది పెట్టాయి. దీంతో కాంగ్రెస్‌పై ప్రజల్లో ఒక రకమైన వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఇదే సరూర్‌నగర్ రాహుల్ సభలో ప్రతిబింబించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రం ఏమీ ఇవ్వలేదని 'గాడిద గుడ్డు' బొమ్మతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే.. గ్యారెంటీల పేరుచెప్పి కాంగ్రెస్ కూడా తమకూ అదే ఇచ్చిందన్న భావనతో ప్రజలు ఉన్నారని, అందుకే కాంగ్రెస్ సభలకు స్పందన కొరవడిందని ప్రముఖ విశ్లేషకుడు ఒకరు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల ఫలితాలకు జనం రాని రాహుల్ సభే నిదర్శనమని ఆయన చెప్పారు.

రైతు భరోసా అమలు చేశారట!

- రైతుకు 7500 ఇచ్చామన్న రాహుల్
- మహిళలకు నెలకు 8500 ఇస్తాం
- కుటుంబానికి ఏడాదికి రూ.లక్ష
- ఒక్క దెబ్బతో పేదరికాన్ని తొలగిస్తాం
- పంద్రాగస్టు వరకు రుణమాఫీ, 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం
- జనజాతర సభలలో రాహుల్ గాంధీ అలవికాని హామీలు

హైదరాబాద్ సిటీబ్యూరో/ మెదక్, మే 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల వేళ జనజాతరసభలోనూ అదే పంథాను కొనసాగిస్తున్నది.జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాష్ట్రానికి ప్రచారానికి వచ్చి సీఎం రేవంత్‌ను మించిపోయి అబద్ధాలను వల్లెవేశారు. గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో, ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జనజాతర సభలలో రాహుల్‌గాంధీ హామీలకు, అబద్ధాలకు అంతేలేకుండాపోయింది. రాష్ట్రంలో యాసంగి రైతుబంధు ఇవ్వడానికి ఓవైపు రేవంత్ సర్కారు ఆపసోపాలు పడుతున్నది. ఈ పరిస్థితుల్లో రాహుల్ గాంధీ రైతులకు రైతు భరోసా ఇచ్చేశామని గొప్పలు చెప్పడంతో రైతులు ముక్కున వేలేసుకున్నారు. ఎకరానికి రూ. 5వేలు ఇవ్వడానికే కష్టపడుతున్న కాంగ్రెస్‌ప్రభుత్వం...ఎకరానికి 7500 చొప్పున ఇచ్చామని చెప్పడమేంటని రైతులు మండిపడ్డారు. ఇదేకాకుండా ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మహిళలకు రూ. 2500 ఇస్తామని చెప్పి ఇంతవరకూ అమలు చేయలేదు. నాలుగు రోజుల క్రితం నిర్మల్ సభలో రాహుల్ గాంధీ రూ. 2500 ఇస్తున్నామని చెప్పారు. తాజాగా కేంద్రంలో అధికారంలోకి వస్తే తెలంగాణలోని ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళను ఎంపిక చేసి, ఆ మహిళ బ్యాంకు అకౌంట్‌లో ఏడాదికి లక్షరూపాయలు డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. మహిళల చదువు, వైద్యం కోసం ప్రతినెలా రూ. 8500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక్క దెబ్బతో దేశంతో పాటు తెలంగాణలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలిస్తామని చెప్పడం గమనర్హాం. నెలకు రూ. 2500 అమలు చేయని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు నెలకు రూ. 8500 ఇస్తామని హామీ ఇవ్వడంపై మహిళలు గుర్రుగా ఉన్నారు.ఇదే కాకుండా సోనియాగాంధీ జన్మదినం డిసెంబర్ 9న రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి, మాట తప్పిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్ల ఒట్టు వేసి పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తామని గడువు పొడిగించారు. ఇదేబాటలో రాహుల్‌గాంధీ కూడా నరేంద్రమోదీ మిలీనియర్ల రుణమాఫీ చేశారు కానీ రైతుల రుణమాఫీ చేయలేదని, మా ప్రభుత్వం వచ్చిన వెంటనే మొట్టమొదటి పని రైతులకు పరిపూర్ణమైన రుణమాఫీ చేయబోతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయలేదు. అకాల వర్షాలకు ధాన్యం కొట్టుకుపోతున్నా చోద్యం చూస్తున్న ముఖ్యమంత్రిని పక్కన పెట్టుకునే రాహుల్‌గాంధీ ధాన్యానికి మోడీ సరైన వ్యవసాయ ఉత్పత్తులకు ఇవ్వాల్సిన ధర ఇవ్వడం లేదన్నారు. కనీస మద్దతు ధర చట్టం కల్పించి వరికి, చెరుకుకు మద్దతు ధర ఇప్పించి తీరుతామని అన్నారు. అంతేకాకుండా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనను తమ ఖాతాలో వేసుకున్నది. కానీ రాహుల్‌గాంధీ మాత్రం కేంద్రంలో 30లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఆగస్టు 15లోపు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇలా అబద్ధాల పునాదులపైనే కాంగ్రెస్ మరోసారి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నదని ప్రజలు మండిపడుతున్నారు.

దళిత దళారీ కుటుంబానికి ఓటుతో బుద్ధి చెప్పాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

గోదావరిఖని, మే 9: దళిత దళారీ వెంకటస్వామి కుటుంబానికి ఓటుతో బుద్ధి చెప్పాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లోని గాంధీచౌక్ వద్ద గల బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కోట్లకు పడగెత్తిన కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి కుటుంబీకులు పెద్దపల్లి జిల్లాను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. వారి అక్రమ ఆస్తులను రేవంత్‌రెడ్డికి అప్పనంగా కట్టబెట్టి కుటుంబం మొత్తం పదవులను అనుభవిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుటుంబ పాలనకు తెరలేపుతున్న రేవంత్‌రెడ్డికి ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలని సూచించారు.కాకా కుటుంబం జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఇక్కడ మరో దళితుడికి అవకాశం కల్పించకుండా దళితులను మోసం చేస్తున్నదని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటువేసి దళిత ముసుగులో ఉన్న దళారులను పెద్దపల్లి నుంచి తరిమికొట్టాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధురాజు, ఎంఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఈర్ల ప్రేమ్‌కుమార్, మాచర్ల శ్రీనివాస్, నాగరాజు, మల్లేశ్, మధునయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



కోహెడ రోడ్‌షోలో భవనాలపై నుంచి వినోద్‌కుమార్ ప్రసంగాన్ని వింటున్న జనం

గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ మోసం

- దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం
- రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలి
- కోహెడ రోడ్‌షోలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

సిద్దిపేట జిల్లా కోహెడ రోడ్‌షోలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హుస్నాబాద్, మే 9: ఆరు గ్యారెంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టించిందని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకు కరెంటు కోతల్లో, రైతుబంధు ఎగ్గొట్టడంలో, కేసీర్ కిట్ బంద్ చేయడంలో, కల్యాణలక్ష్మి రద్దు చేయడంలో నిత్యావసర వస్తువుల ధరలు పెంచడంలో, రుణమాఫీని విస్మరించడంలో మాత్రం మార్పు తెచ్చిందని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల ముచ్చట మర్చిపోయి ఏ గుడికాడికి పోతె ఆ గుడి దేవుడిపై ఒట్టు వేస్తూ మళ్లీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డివన్నీ ఝూటా మాటలని అన్నారు. రైతులకు బోనస్ లేదు, మహిళలకు రూ.2,500 లేవు, రుణమాఫీ లేదు, పింఛన్ పెంపులేదు, సంక్షేమ పథకాల అమలు చేయకుండా మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. దేవుడి పేరు చెప్పి బీజేపీ రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. ప్రధాని మోదీ వేములవాడకు వచ్చి దేవాలయ అభివృద్ధికి కనీసం నిధులు మంజూరు చేయకపోవడం, అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వక పోవడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఒక్క గుడికి, బడికి కూడా నిధులు మంజూరు చేయించలేదని విమర్శించారు. ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతాడని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులో తప్పు మీద తప్పు

- రోజుకో కోర్టు ముందుకు క్రిశాంక్
- ఫోర్జరీ జరిగినట్టు ఆధారాలు చూపని పోలీసులు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు సైతం బేఖాతరు
- రాష్ట్ర పోలీసుల తీరుపై సర్వత్రా విస్మయం

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌పై ఆధారాలు లేని ఓ తప్పుడు కేసు పెట్టి.. సీఎం ఆదేశాల మేరకు పోలీసులు ఇష్టారీతిన వేధిస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ టీమ్ ఆరోపించింది. ఓ తప్పుడు కేసులో క్రిశాంక్‌ను బలవంతంగా ఇరికించేందుకు తప్పు మీద తప్పులు చేస్తూనే ఉన్నారని మండిపడింది. ఈ నెల 1న క్రిశాంక్‌ను బలవంతంగా అరెస్టు చేసింది మొదలు.. 9వ తేదీ రాత్రి వరకూ కోర్టుల ముందు హాజరుపర్చేందుకు తిప్పుతూనే ఉన్నారని మండిపడింది. ఈ మేరకు గురువారం బీఆర్ఎస్ లీగల్ టీమ్ ఓ ప్రకటన విడుదల చేసింది. 'సోషల్ మీడియాలో ఒక నోటీసు ప్రచారం చేయబడుతున్నది. అది విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నది' అంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడని, అందులో ఎక్కడా క్రిశాంక్‌ను పేర్కొనలేదని తెలిపింది. అయినప్పటికీ పోలీసులు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా మన్నె క్రిశాంక్‌ను అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ రోజు అర్ధరాత్రి వరకు క్రిశాంక్‌ను పలు పోలీస్‌స్టేషన్లకు తిప్పారని తెలిపారు.ఎందుకు అరెస్టు చేశారో, ఎక్కడ ఉంచారో చెప్పాలని కుటుంబసభ్యులు బతిమాలినా పోలీసులు వెల్లడించలేదని పేర్కొన్నారు. ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఆరా తీస్తే.. కేసు డైరీ కాపీని అందించారని, మాట్లాడేందుకు ప్రయత్నిస్తే అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లకుంట పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీ దవాఖానకు, అక్కడి నుంచి లాలాగూడ పీఎస్‌కు తీసుకెళ్లారని చెప్పారు. ఆ రోజు రాత్రి 11.30 గంటలకు ఈస్ట్ మారేడ్‌పల్లిలోని 4వ ఏసీఎంఎం న్యాయమూర్తి ముందు హాజరుపర్చారని తెలిపారు.

సుప్రీం ఆదేశాలు తుంగలో తొక్కి..

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఈ రకం కేసుల్లో నిందితులకు ముందుగా 41ఏ సీఆర్పీసీ నోటీసులు జారీచేయాలని బీఆర్ఎస్ లీగల్ టీమ్ పేర్కొన్నది. ఇందుకు తెలంగాణ హైకోర్టు సర్క్యూలర్ జారీ చేసిందని గుర్తుచేసింది.ఒకవేళ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేసి, కోర్టుముందు హాజరుపరిస్తే మరుసటి రోజు పూచీకత్తుతో కూడిన బెయిల్ మంజూరు చేయాలని తెలిపింది. అయితే మన్నె క్రిశాంక్‌లో ఆ నిబంధనలు పాటించకపోగా, సుప్రీంకోర్టు తీర్పులను విస్మరిస్తూ..బెయిల్ మంజూరు కాకుండా పోలీసులు తిప్పుతున్నారని తెలిపింది. క్రిశాంక్‌ను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతోనే 9 రోజులుగా కోర్టుముందు తిప్పుతున్నారని పేర్కొం ది. ఎన్నికలు పూర్తయ్యేవరకూ క్రిశాంక్‌ను జైల్లోనే ఉంచాలనే కుట్రతో కాంగ్రెస్‌పార్టీ కుయుక్తులు పన్నుతున్నదని బీఆర్ఎస్ లీగల్ టీమ్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.

అక్రమ అరెస్టు వివరాలు..

- ఏప్రిల్ 30న సాయంత్రం 4.45 గంటలకు క్రిశాంక్‌పై ఎఫ్ఐఆర్ నం.207/2024 నమోదైంది.
- ఐపీసీ 466, 468, 469, 505(1)(సీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.
- ఈ ఎఫ్ఐఆర్‌ను కేవలం గంటలోనే కోర్టుకు సమర్పించారు.
- మే నెల ఒకటిన మధ్యాహ్నం 12.30 గంటలకు చౌటుప్పల్ దగ్గర పంతంగి టోల్‌ప్లాజా వద్ద క్రిశాంక్‌ను అరెస్టు చేశారు.
- ఒకటవ తేదీన మళ్లీ ఐపీసీ 469, 465, 417, 471, 505(1)(బీ) సెక్షన్ల కింద కేసులు పెట్టారు.
- క్రిశాంక్‌పై నమోదు చేసిన అన్ని సెక్షన్లలోనూ శిక్ష ఏడేండ్లలోపే ఉంటుంది. ఇటువంటి కేసుల్లో.. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం పోలీసులు 41ఏ సీఆర్పీసీని అనుసరించాలి. ఇందుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు జారీచేసిన సర్క్యూలర్‌లోని సూచనలను పాటించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు.
- రిమాండ్ కేసు డైరీలో కే నాగేందర్‌ను రెండో నిందితుడిగా చేర్చారు.
- రిమాండ్ కేసు డైరీలో 'ఇది రాజకీయ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో, మోసం చేసే ఉద్దేశంతో డాక్యుమెంట్‌ను ఫోర్జరీ చేశారు' అని దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. అది ఏ రాజకీయ పార్టీనో తెలుపలేదు.

బెయిల్ పిటిషన్ వివరాలు

- పోలీసుల రిమాండ్ విజ్ఞప్తిని తిరస్కరించాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ దాఖలు చేసిన మెమోను న్యాయమూర్తి అంగీకరించలేదు. పోలీసు రిమాండ్‌కు అనుమతిస్తూ కేసును 2వ తేదీకి వాయిదా వేశారు.
- 2వ తేదీన లంచ్ తర్వాత కౌంటర్ దాఖలు చేయడానికి ప్రాసిక్యూషన్ పాస్ ఓవర్ కోరింది.
- దీంతో నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. 'వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకోకూడదు' అని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు ఇచ్చింది. ఏ2గా ఉన్న వ్యక్తికి 41ఏ సీఆర్పీసీని అనుసరించి నోటీసులు ఇవ్వాలని తెలిపింది.
- పీపీ కౌంటర్ దాఖలు చేయడానికి అనుమతిస్తూ.. కేసును 3వ తేదీకి వాయిదా వేసింది.
- 3వ తేదీన ప్రాసిక్యూషన్ 2 రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది.
- ఉత్తర్వుల కోసం న్యాయమూర్తి కేసును 4వ తేదీకి వాయిదా వేశారు.
- ఈ కేసులో 5వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 6వ తేదీ 11 గంటల వరకు ఒక రోజు కస్టడీ ఇస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.
- క్రిషాంక్ బెయిల్ పిటిషన్‌పై 9వ తేదీన 8వ ఏసీఎంఎం న్యాయమూర్తి ఇరుపక్షాల వాదనలను విని, తదుపరి విచారణ కోసం కేసును10వ తేదీకి వాయిదా వేశారు.